క్లుప్తంగా

పట్టభద్రులకు ఓటు దరఖాస్తులు



విజయవాడస్పోర్ట్స్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు కోరారు. విజయవాడ సివిల్ కోర్టుల వద్ద సోమవారం ఓటు నమోదు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు నమోదు కోసం పట్టభద్రులకు ఫాం–18ను అందజేశారు. సుమారు 500 మంది పట్టభద్రులకు దరఖాస్తులు అందజేసినట్లు న్యాయవాదులు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తునకు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్, డిగ్రీ ప్రొవిజినల్/ఓడీ జిరాక్స్‌లను జత చేసి నవంబర్ ఆరో తేదీ లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ఈ నెల 23వ తేదీ బుధవారం వరకు కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సీనియర్ న్యాయవాదులు పూనూరు గౌతం రెడ్డి, సాయిరాం, ఒగ్గు గవాస్కర్, ఆమేరి రమేష్, బసవరెడ్డి, మోటుపల్లి విఠల్‌రావు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): వరద ప్రభావిత ప్రాంతాల్లోని హైస్కూల్స్ విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో 700 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 నోటు పుస్తకాల చొప్పున మానవత సంస్థ ప్రతినిధులు ఉచితంగా పంపిణీ చేశారు. 64వ డివిజన్ కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో 600మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా కోశాధికారి జె.వీరవెంకట సత్యనారాయణ, అమరావతి బాలోత్సవ్ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మైనం హుస్సేన్, కె.వి.దుర్గారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్ డొంకరోడ్డులో రూ.4.8లక్షలతో మురుగుకాలువ, కల్వర్టు పనులు చేపట్టారు. ఈ మురుగుకాలువ పనులను స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్ రావు సోమవారం పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు.

1 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 1వ తేదీ నుంచి టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నామని ఎం.బి. విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణా విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల శిక్షణలు ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, మిషన్ ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. వచ్చే నెల 1 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణ నాలుగు నెలల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీ లోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన కర్ణాటక సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన నెమలికంటి జ్యోతి బృందం ఆలపించిన కర్ణాటక సంగీతం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సోమవారం జ్యోతి, బి.సూర్యకాంతి, ఎం.వనజశ్రీలు పలు కీర్తనలను వీనులవిందుగా ఆలపించారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై కళాకారులు ఆలపిస్తున్న సంగీతానికి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం కళాకారుల బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

రోడ్డుపై నడవాలంటే.. హడలే!

- సింగ్‌నగర్‌లో ఆకతాయిల ఆగడాలు..
- పాఠశాలలు, కూడళ్ల వద్ద విద్యార్థినులు, మహిళలపై వేధింపులు
- తీవ్ర ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు, మహిళలు
- ప్రత్యేక పోలీసు బీట్లు ఏర్పాటుకు డిమాండ్



ఆకతాయిలకు అడ్డాగా మారిన ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌రోడ్డు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పాఠశాల అనంతరం స్నేహితులతో కలిసి ఇంటికి వెళ్తుండగా ముగ్గురు ఆకతాయిలు వెంబడించి వేధింపులకు గురిచేశారు. ఆమె ప్రతిఘటించడంతో వారు ఆమెపై బూతుపురాణాలతో రెచ్చిపోయారు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేసే ధైర్యం చేయలేక మిన్నకుండిపోయారు.

■ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌కు చెందిన ఓ ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి ఆమెను అడ్డగించారు. ప్రేమిస్తావా..అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఆమె వెంటబడ్డారు. దీంతో ఆ బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు ఆ ఆకతాయిలతో గొడవ ఎందుకని బాలికను వారే స్కూల్‌కు తీసుకువెళ్తూ..సాయంత్రం ఇంటికి తీసుకువెళ్తున్నారు.

■ న్యూరాజరాజేశ్వరీపేట దేవినేని వెంకటరమణ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఓ పదోతరగతి విద్యార్థినిని కూడా ఆకతాయిలు ఇలానే వేధింపులకు గురిచేశారు.

■ ఇందిరానాయక్‌నగర్‌కు చెందిన ఓ మహిళ తన ఇంటికి వెళ్తుండగా బుడమేరు కాలువ వెంబడి నలుగురు ఆకతాయిలు కూర్చొని మద్యం సేవిస్తూ ఆమెను అసభ్యపదజాలంతో వేధించారు...ఇలా చెప్పుకుంటూ పోతే సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూరాజరాజేశ్వరీ పేట, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల వేధింపులతో విద్యార్థినులు, మహిళలు నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పగా వారు పరువు పోతుందని.. ఆకతాయిలతో మాకు గొడవలు ఎందుకని ఆలోచిస్తూ వారి ఆవేదనలను 'సాక్షి' ఎదుట వెలిబుచ్చారు.

సమస్యాత్మక ప్రాంతాలివే..

సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూరాజరాజేశ్వరీపేటలోని దేవినేని వెంకటరమణ మున్సిపల్ హైస్కూల్, కేర్ అండ్ షేర్ స్కూల్, అపార్ట్‌మెంట్స్ ప్రాంతం, ఇందిరానాయక్‌నగర్ బుడమేరు కాలువ కట్ట రోడ్డు, సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్, లెనిన్‌సెంటర్, వివేకానంద సెంటినరీ హైస్కూల్, మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం, డాబాకొట్లు సెంటర్ రోడ్డు, ఎక్సెల్‌ప్లాంట్ వెంబడి అపార్ట్‌మెంట్ల ప్రాంతం, కృష్ణాహోటల్ సెంటర్, దుర్గాబార్ పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల సమస్య అధికంగా ఉంది. ప్రధానంగా చీకటిపడిన వెంటనే ఆకతాయిలు గుంపులుగా చేరి అటుగా రాకపోకలు సాగించే విద్యార్థినులు, యువతులు, ఒంటరి మహిళల వెంటపడి వేధింపులకు గురిచేస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇందిరానాయక్‌నగర్ బుడమేరు కట్ట వెంబడి రోడ్డు

పోలీసులు చర్యలు తీసుకోవాలి...

ప్రధానంగా పాఠశాలలు, కూడళ్ల వద్ద ఆకతాయిలు తిష్టవేసి ఉంటున్నారని...పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయాలలో.. పనుల నుంచి మహిళలు ఇంటికి వచ్చే వేళల్లో వీరంతా రోడ్లపైకి వచ్చి వారి వెంటపడి వేధించడం.. అదేమని ప్రశ్నించిన వారిపై గొడవలకు దిగడం చేస్తున్నారు. మరికొంత మంది బైకులతో వచ్చి రోడ్డువెంట నడిచే వారి పక్క నుంచి బైకులు వేగంగా నడపడం, హారన్‌లు కొట్టుకుంటూ వారిని ఉరుకులుపరుగులు పెట్టించడం చేస్తున్నారు. పోలీసులు స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బీట్లు ఏర్పాటుచేసి ఆకతాయిల ఆగడాలను అదుపుచేసి తమకు రక్షణ కల్పించాలని విద్యార్థులు, మహిళలు కోరుతున్నారు.

రోడ్డుపై మద్యం సేవిస్తున్నారు..



ఇందిరానాయక్‌నగర్ నుంచి రాజరాజేశ్వరీపేటకు వెళ్లే దారిలోని బుడమేరు కట్ట వెంబడి రోడ్డుపై రోజూ ఆకతాయిలు రోడ్డు మధ్యలో తిష్టవేస్తూ మద్యం తాగి సీసాలను పగలకొట్టి అల్లర్లకు పాల్పడుతున్నారు. దీంతో ఈ రోడ్డుపై నడవాలంటేనే భయంగా ఉంటుంది. పోలీసులు రాత్రుల సమయంలో ఇక్కడ ప్రత్యేక బీటు ఏర్పాటుచేసి రక్షణ చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– దేవి కేశవాణి, ఇందిరానాయక్‌నగర్

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి..



సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలు బాగా పెరిగిపోయాయి. పాఠశాలలు, స్టేడియం వద్ద గుంపులుగా చేరడం, బైకులను ఇష్టారీతిన నడుపుతూ అల్లర్లు చేస్తున్నారు. ఆకతాయిల దుశ్చర్యల కారణంగా ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పోలీసులు సమస్యా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఆకతాయిల వేధింపులను అరికట్టాలి.

– మంగలపూడి జోసఫ్(సింగ్‌నగర్)

కాలుష్య రహిత నగరానికి చర్యలు తీసుకోండి



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్యం రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు చేపట్టిందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం ఆయన పాల్గొన్న తర్వాత అధికారులకు ఆదేశాలిచ్చారు. తాగునీటి సరఫరా, వాడుక నీటి శుద్ధిపై మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ న్యూఢిల్లీ కన్సల్టెన్సీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. అందులో భాగంగా నగరంలో వాడుక నీటి శుద్ధత, తాగునీటి సరఫరా అంశాలపై తీసుకోవాల్సిన చర్యలు సూచించారు. నీటి శుద్ధత కోసం చర్యలు తీసుకొని విజయవాడ నగరాన్ని కాలుష్యం రహిత నగరంగా మార్చాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

2నుంచి అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో నవంబర్ రెండోతేదీ నుంచి డిసెంబర్ ఒకటోతేదీ వరకు స్వాములు, భవానీ మాలధారులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు సోమవారం తెలిపారు. ఏటా కార్తీక మాసంలో మాలధారులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. మాలధారులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

క్లాప్ ఆటోలను నిలిపివేయడం సరికాదు

మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మున్సిపాలిటీలలో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలను నిలిపివేయడం సరికాదని.. ప్రభుత్వమే వాటిని నడపాలని మాజీఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెత్త తరలించే వాహనాలు నిలిచిపోవడంతో నివాసాలు..ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్లాప్ కార్యక్రమం ఎంతగానో విజయవంతమైందని.. విజయవాడ నగరానికి జాతీయస్థాయిలో అనేక అవార్డులు సైతం వచ్చాయని గుర్తుచేశారు. అటువంటి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలి తప్ప, ప్రజలను ఇబ్బందిపెట్టే రీతిలో కాదని దుయ్యబట్టారు. కూటమి నిర్ణయం ఫలితంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని నగరాలు, పట్టణాలలో పారిశుద్ధ్య పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. పైగా మారిన వాతావరణ పరిస్థితుల్లో నగరంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని.. ప్రజలందరూ డయేరియా భయంతో వణికిపోతున్నారన్నారు. విజయనగరంలో డయేరియా బారిన పడి 11 మంది మత్యువాతపడినా, ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. చాలాచోట్ల ప్రజలు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్కిల్–2 పరిధిలో రోజుకి దాదాపు 200 టన్నుల చెత్తను 90వాహనాల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆటోలు రాక, చెత్త ఎక్కువ రోజులు ఇళ్లల్లోనే ఉండిపోతే మరిన్ని వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కనుక ప్రభుత్వం తక్షణమే క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి, ఆయా వాహనాలను పునరుద్ధరించాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మధురానగర్ సబ్‌స్టేషన్ పసుపుతోట ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురానగర్ మెయిన్‌రోడ్డు, లెక్చరర్స్ కాలనీ, ఇందిరా కాలనీ, రైల్వేసొసైటీ కాలనీ, రాగం మస్తాన్‌రావురోడ్డు, జాన్ టీస్టాల్ నుంచి రామాలయం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అలంకార్ సబ్‌స్టేషన్ పరిధిలో...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ అలంకార్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవీంద్రబాబు తెలిపారు. ఆంధ్రరత్న రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, నారా వారి వీధి, గల్లా వారి వీధి, హిందీ స్ట్రీట్, జ్ఞానోలీవ్ స్ట్రీట్, ఫిల్మ్ చాంబర్ స్ట్రీట్, అన్నపూర్ణ రోడ్డు, జమీందారు స్ట్రీట్, సన్యాసిరాజు స్ట్రీట్, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

పాయకాపురంలో...

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు ఈఈ రవీంద్రబాబు తెలిపారు. ప్రకాష్‌నగర్, పటేల్‌కాలనీ, పాకిస్తాన్ కాలనీ, ఎల్‌బీఎస్ నగర్, సుందరయ్యనగర్, లక్ష్మీనగర్, మెయిన్‌రోడ్డు పాయకాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

కేబీఎన్‌లో స్కూటీ ఉచిత డ్రైవింగ్‌పై శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నారాయణరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి స్కూటీ డ్రైవింగ్‌పై మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణకు రూపొందించిన పోస్టర్‌ను హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు సోమవారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ.. తమ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా మహిళలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. అదే క్రమంలో మహిళలకు స్కూటీ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. మహిళల్లో ఆత్మస్థైర్యంతో పాటు ధైర్యంగా ముందుకు దూసుకుపోవటానికి అవసరమైన పలు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ శిక్షణా తరగతులకు సంబంధించి కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



ఇన్‌చార్జ్ చైర్మన్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీఆర్‌ఎస్‌ఎం నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘం(ఏబీఆర్‌ఎస్‌ఎం) రాష్ట్రశాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మహాసంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను వెంటనే నియమించాలని, 2024 సంవత్సరానికి ఉత్తమ అధ్యాపకుల వివరాలను వెంటనే ప్రకటించి అవార్డులు అందజేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న దాదాపు 5వేల అధ్యాపకుల పోస్టులను ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు జీవో నంబర్ 110 ప్రకారం కనీస వేతనంగా రూ.50వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.రామ్మోహన్ రావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృతికా శుక్లా, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, డాక్టర్ పోలా భాస్కర్ తదితరులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగినేని రంగనాథ్, డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ డివిఎస్ఎస్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలంటూ సీపీఎం ధర్నా



ఆందోళన చేస్తున్న సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు కాశీనాథ్, వరద బాధితులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద నీటిలో వారం రోజులు ఇబ్బందులు పడ్డాం. మాకు పరిహారం అందలేదు. సచివాలయాల చుట్టూ తిరుగుతున్నాం.అక్కడకి వెళితే మ్యాపింగ్ కాలేదంటూ తిప్పి పంపుతున్నారు' అంటూ కృష్ణలంక, తారకరామానగర్ వరద బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట వరద బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో కృష్ణలంక రాణిగారి తోట, తారక రామానగర్, భూపేష్‌గుప్తా నగర్, గీతానగర్, రణదీవ్‌నగర్ ప్రాంతాలకు చెందిన వరద బాధితులు పాల్గొన్నారు. కృష్ణానది వరదల కారణంగా ఇళ్లు నీటమునిగాయని, వారం రోజులపాటు నడుములోతు నీళ్లలో ఉన్నామని బాధితులు వాపోయారు. వరద కారణంగా నష్టపోయి 50 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి తమకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాలకు వెళితే రకరకాల పేర్లతో కొర్రీలు వేస్తున్నారని మండిపడ్డారు. ధర్నాలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కృష్ణలంకలోని వేలాది కుటుంబాలు వరదల్లో దెబ్బతిన్నాయన్నారు. జనం కట్టుబట్టలతో రోడ్లపైకి చేరి, పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చిందన్నారు.సీఎం చంద్రబాబు వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని, చివరి బాధితుడు వరకు నష్టపరిహారం అందిస్తాంమంటూ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కానీ ఈ ప్రాంతాల్లో సగానికి పైగా బాధితులకు పరిహారం అందలేదన్నారు. ఈవిషయంపై ఇప్పటికే అనేక పర్యాయాలు అధికారులకు, సచివాలయాల్లో అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. నెలలు గడుస్తున్నా బాధితులకు పరిహారం అందకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో అనేక లోపాలు ఉన్నాయని విమర్శించారు. తోపుడు బండ్లు, కిరాణా షాపులు, చిరు వ్యాపారులకు, వాహనాలకు నష్టపరిహారం అందాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ప్రచార ఆర్భాట కార్యక్రమాలే తప్ప ప్రజలకు, బాధితులకు అండగా నిలిచి బాధితులందరినీ ఆదుకునే ప్రయత్నం చేయడంలేదని మండిపడ్డారు. బ్యాంక్ లింక్, ఆధార్ ఈకెవైసి, మ్యాపింగ్ వంటి సాకులు చూపించి బాధితులకు పరిహారం అందించకుండా కూటమి ప్రభుత్వం తప్పించుకుంటోందన్నారు. చివరి బాధితుడికి సహాయం అందేవరకు సీపీఎం పోరాడుతుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరగకపోతే కలెక్టరేట్‌ను స్తంభింపజేస్తామని, సచివాలయ ముట్టడికి వెనుకాడబోమని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు అనంతరం సెంట్రల్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రంతోపాటు బాధితుల అర్జీలు అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నగర నాయకులు టి.చంద్రశేఖర్, కోరాడ రమణ, ఎన్.నాగేశ్వరరావు, వై. కృష్ణ, కోటిరెడ్డి, ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారాన్ని తొలగించరూ...





జీవీఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు, దావు బుచ్చయ్యకాలనీలో రోడ్డు పక్కన వదిలివేసిన చెత్తచెదారం, సిల్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు పక్కనే చెత్తచెదారం, సిల్టు వ్యర్థాలు వదలివేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అలాగే చెత్తచెదారం, సిల్టు వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల ఇక్కడ బుడమేరులో చెత్తచెదారం సిల్టును తొలగించారు. కానీ తొలగించినచెత్తచెదారం సిల్టును మాత్రం రోడ్డుపక్కనే వదలివేశారు. చెత్తచెదారం కారణంగా దోమలు వృద్ధిచెందుతూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షం పడితే చెత్తచెదారం కారణంగా రోడ్డు మరింత అధ్వాన్నంగా మారే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి చెత్తచెదారం, సిల్టు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల హృదయాల్లో ఘంటసాల పాటలు



మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర్‌రెడ్డి, వేదికపై చిట్టిబాబు, మల్లీశ్వరి, శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ కల్చరల్: ఘంటసాల పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు చైతన్యవేదిక ఆధ్వర్యంలో కొత్తా పూర్ణానందం కళావేదికపై రెండురోజులుగా నిర్వహిస్తున్న 13వ జాతీయ మహాసభలు సోమవారం ముగిసాయి.ఈ సందర్భంగా మహాసభల సమన్వయకర్త వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగువారి జీవితాలను ఘంటసాల పాట ప్రభావితం చేసిందన్నారు. నవంబరు రెండోవారంలో కళాకారుల సమస్యలను చర్చిండానికి మరో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. డిసెంబరు నెలలో విజయవాడ వేదికగా రెండురోజులపాటు ఘంటసాల 102వ జయంతి వేడుకలను నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డీవీ రంగారెడ్డి, కేవీ ప్రసాద్, కే డేవిడ్‌రాజు, సింగంపల్లి రమణ, కత్తి శ్యాంప్రసాద్, బీఎస్ఎల్ శ్రీనివాస్, దయామణి, పుత్తూరు పద్మ, బిత్రా చైతన్యకుమార్, మురళి, కారుమంచి రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను శాఖాధిపతులే స్వయంగా పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 7 ఫిర్యాదులు వచ్చాయి. అందులో రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్, తాగునీటి సరఫరా, కమ్యూనిటీ హాలు నిర్వహణపై వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. శాఖాధిపతులందరూ తమ తమ శాఖల్లో ఉన్న సచివాలయం సిబ్బందిని పర్యవేక్షిస్తూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీని వల్ల ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించబడతాయని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, సీఈ శ్రీనాథ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి సీఎంఓహెచ్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ(వర్క్స్) పి.సత్యనారాయణ, ఎస్ఈ(ప్రాజెక్ట్స్) సత్యకుమారి, అమృత్ జేడీ, పీఓ యూసీడీ డాక్టర్ లత, ఏడీహెచ్ రామ్మోహన్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వీఏఎస్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.